ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (శని)
సహారి : 4.39 (ఆది)

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ప్రభుత్వ లక్ష్యం సిబ్బంది కొరతతో నీరుగారుతోంది. అత్యాధునిక వసతులతో భవన నిర్మాణాలు, వసతు లను కల్పిస్తున్నా రోగులకు వచ్చిన వ్యాధుల నిర్ధారణ చేసేందుకు సరైన వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి రూ.వేలల్లో సొమ్ము ఖర్చు చేయలేక ప్రభుత్వాస్పత్రినే ఆశ్రయిస్తున్నారు. మరికొంతమంది అప్పులు చేసి ప్రైవేటు వైద్యాన్ని పొందుతున్నారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వాస్పత్రి, చింతలపూడి ఏరియా ఆస్పత్రి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిని 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు అంశాలు వెలుగుచూశాయి.


కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో క్యాజువలిటీ రూంలో గోడలకు పెచ్చులూడిన దృశ్యం



ప్రభుత్వాస్పత్రుల్లో.. సమస్యల తిష్ఠ!

ఆంధ్రజ్యోతి విజిట్

- వైద్యుల కొరత..రోగుల ఇబ్బందులు
- సిబ్బంది కొరతతో సేవలు దూరం
- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు


తలుపులు మూసి ఉన్న ఎక్స్‌రే విభాగం

వారం రోజులుగా నో ఎక్స్‌రే..

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిని ఏళ్ల తరబడి పలు సమస్యలతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. పేరుకు వంద పడకల ఆసుపత్రి అయినా తగిన సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నెల 22 నుంచి ఎక్స్‌రే విభాగంలో సీఆర్ సిస్టమ్ రీడర్‌కు రిపేరు రావడంతో రోగులకు ఎక్స్‌రే సేవలు అందడం లేదు. దీంతో ఆర్థోపెడిక్ రోగులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. శుక్రవారం భారతి అనే ఓ మహిళ కాలునొప్పితో రాగా సంబంధిత డాక్టరు ఎక్స్‌రే తీయించుకురమ్మన్నారు. తీరా ఎక్స్‌రే విభాగానికి వెళ్తే సోమవారం రమ్మని పంపిచేశారు. పట్టణానికి చెందిన అల్లిపల్లి శివకు శుక్రవారం కారు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అతని కాలికి, చేతికి గాయాలయ్యాయి. ఆర్థోపెడిక్ డాక్టర్ పరిశీలించి ఎక్స్‌రే తీయించుకుని రమ్మనగా బయట రూ.600 ఖర్చు చేసి ఎక్స్‌రే తీయిం చుకుని వచ్చారు. ఆస్పత్రిలో రక్తపరీక్షా కేంద్రం వద్ద రిపోర్టులు తీవ్ర ఆలస్యం కావడంతో రోగులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల నుంచి ఇక్కడకు ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఎమర్జెన్సీ కేసులను ఏలూరు, విజయవాడ రిఫర్ చేస్తూనే ఉన్నారు. ఇక్కడ ఐసీయూ విభాగం లేదు. ఆస్పత్రిలో 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 17 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు.ఆరు పోస్టులను భర్తీ చేయాల్సిఉంది. నర్సింగ్ సూపరిండెంటెంట్ గ్రేడ్-2 ఒక పోస్టు, స్టాఫ్ నర్సులు 11, ఫార్మాసిస్టు గ్రేడ్-2 ఒక పోస్టు, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఒక పోస్టు, రేడియో గ్రాఫర్ ఒక పోస్టు , డార్క్ రూమ్ అసిస్టెంట్ ఒక పోస్టు,ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయి. మార్చురీ రూమ్ నిర్మాణం పూర్తి కాకపోవడంలో పాత ఆస్పత్రి భవనంలోనే మృత దేహాలను ఉంచుతున్నారు. అధికారులు స్పందించి వైద్య సిబ్బందిని నియమించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


మరమ్మతులకు నోచుకోని ఎక్స్‌రే విభాగంలో సీఆర్ సిస్టమ్ రీడర్

12 మందికి ఏడుగురే వైద్యసేవలు

కైకలూరు : కైకలూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వైద్య సేవలందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 12 మంది వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. మరో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజిస్టు, సర్జన్, ఫిజియో థెరపీ, పీడియాట్రిషియన్, అనస్తీషియా వైద్యులు అందుబాటులో లేరు. ఆస్పత్రి భవన నిర్మాణం చేసినప్పటి నుంచి గత ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు చేయకపోవడంతో క్యాజువాలిటీ రూంలో గోడలకు, శ్లాబుకు పెచ్చులూడడంతో రోగులు మీద పడతాయోమనని భయాందోళన గురవుతున్నారు. కొల్లేటికోట, సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత వేధిస్తోంది. కలిదిండి, కోరుకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉంది. మండవల్లి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే సేవలందిస్తున్నారు. తక్కెళ్లపాడులో పీహెచ్‌సీ ఆస్పత్రి ఏర్పాటు చేసి సుమారు రెండేళ్లు కావొస్తున్నా పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది నియామకం జరగలేదు. ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతోంది.


భవనం పెచ్చులూడి లీకేజీలు

పేరుకు వంద పడకలు.. ఉన్నవి 30

చింతలపూడి : చింతలపూడి ఏరియా ఆస్పత్రి రోగులపాలిట సమస్యల నిలయంగా మారింది. పేరుకు వంద పడకల ఆస్పత్రి. కాని 30 పడకల సౌకర్యం మాత్రమే ఉంది. ఇక్కడ 23 మంది డాక్టర్లను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల స్థానికులు, వివిధ పార్టీల నాయకులు ఇక్కడ 23 మంది డాక్టర్ పోస్టులు మంజూరైనా 13 మందే ఉన్నారని, మిగిలిన వారిని భర్తీ చేయాలని వినతులు సమర్పించారు. అయితే విచిత్రంగా పోస్టుల భర్తీ కాలేదు కాని ఉన్నవారి సంఖ్య ఎనిమిది మందికి తగ్గింది. పట్టణ పరిసర గ్రామాలు, మండలాల నుంచి నిత్యం 600 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇందులో 70 శాతం మహిళలే ఉంటారు. ఎక్కువగా డెలివరి కేసులు, మహిళా పేషెంట్లు, పిల్లలు, కంటి వైద్యం, ఆర్థోపెడిక్, డెంటల్, యాక్సిడెంట్ కేసులు వస్తుంటాయి. చింతలపూడి, లింగపాలెం, చాట్రాయి, టి.నర్సాపురం మండలాల నుంచి 108లో పేషెంట్లను తీసుకొస్తుంటారు. ప్రస్తుతం ఉన్న ఈ ఎనిమిది మంది వైద్యుల్లో ఇద్దరు మత్తు డాక్టర్లు, ఒకరు జనరల్ మెడిసెన్, ఒకరు ఆర్థోపెడిక్, ముగ్గురు జనరల్ డాక్టర్లు ఉండగా పది రోజుల క్రితం గైనకాలజి డాక్టర్‌ను నియమించారు. ఇక్కడ పని చేసిన చర్మవ్యాధులు, డెంటల్, పంటి వైద్యం, పలు విభాగాలకు చెందిన డాక్టర్లు బదిలీకాగా కొందరు డిప్యుటేషన్‌పై వెళ్లడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీడియాట్రిక్, గైనకాలజి, ఈఎన్‌టీ వైద్యులు లేకపోవడం రోగులకు ఇబ్బందిగా మారింది. ఆస్పత్రిలో డాక్టర్లు, స్టాఫ్ 90 మంది అవసరముంది. ప్రస్తుతం ఉన్న భవనమంతా లీకేజీల వల్ల పెచ్చులూడి నీరుకారుతోంది. చికిత్సకు, పరీక్షలకు కావాల్సిన సిటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్, రేడియాలజీ డాక్టర్ల కొరత తీర్చమంటే కొరతను సృష్టిస్తున్నట్టుగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. వార్డుల్లోను, ఆపరేషన్ థియేటర్‌లో భవనం పెచ్చులూడి అధ్వానంగా ఉంది. ఆర్థోపెడిక్ డాక్టర్ ఉన్నా సిఆర్మ్ సౌకర్యంలేదు. దీంతో వచ్చిన పేషెంట్లను ఏలూరు తరలిస్తున్నారు. ఆస్పత్రి వద్ద పార్కింగ్ సౌకర్యం, క్యాంటీన్ లేవు. ల్యాబ్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేదు. ఇక రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన భవనాలు 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. ఇప్పటికి రెండుసార్లు ప్రారంభిస్తారని చెప్పినా పనులు పూర్తికావడం లేదు.


కైకలూరు వైస్ ఎంపీపీగా మంగినేని రామకృష్ణకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి అచ్యుత్ అంబరీష్

వైస్ ఎంపీపీ ఎన్నికలు ఏకగ్రీవం

ఏలూరుసిటీ/ కైకలూరు/ఏలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏలూరు వైస్ ఎంపీపీ-2, కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వాస్తవానికి ఈ ఎన్నికలు గురువారం జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడిన విషయం విదితమే. ఈనేపథ్యంలో శుక్రవారం ఆయా మండలాల్లో మండల పరిషత్ ప్రత్యేక సమావేశాలు జరిపి వైస్ ఎంపీపీ ఎన్నికలను నిర్వహించారు. రెండుచోట్ల ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో ఈ ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఏలూరులో టీడీపీ, కైకలూరులో జనసేన అభ్యర్థులు వైస్ ఎంపీపీలుగా విజయం సాధించారు.

కైకలూరు-మంగినేని రామకృష్ణ

కైకలూరు వైస్ ఎంపీపీ ఉప ఎన్నికలో కూటమి పార్టీ విజయం చేజిక్కించుకుంది. రెండురోజులుగా ఏర్పడిన ఉత్కంఠకు శుక్రవారం తెరపడింది. ఏలూరు ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి అచ్యుత్ అంబరీష్ ఆధ్వర్యంలో కైకలూరు వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించారు. కూటమి ఎంపీటీసీ సభ్యులు 10 మంది హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. మెజార్టీ సభ్యులు లేకపోవడంతో వైసీపీ ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. వైసీపీ ఎంపీటీసీలు రాకపోవడంతో ఎన్నిక నిర్వహించి వైస్ ఎంపీపీగా కైకలూరు-2 ఎంపీటీసీ జనసేన పార్టీ నుంచి మంగినేని రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి రామకృష్ణతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణపత్రం అందజేశారు. కైకలూరు టౌన్, రూరల్ సీఐలు కృష్ణ, వి.రవికుమార్ బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించారు.

ఏలూరు రూరల్- నాగరాజు

ఏలూరు రూరల్ మండలం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక శుక్రవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. గురువారం ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా కోరం లేక శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. ఇప్పటివరకు వైస్ ఎంపీపీ-2గా ప్రత్తికోళ్లలంక ఎంపిటిసి భలే సత్యప్రసాద్ రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించారు. సివిల్ సప్లయిస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్ని కల అధికారి ఎల్.దేవకీదేవి ఆధ్వర్యంలో చేతులెత్తి ఎన్నుకునే విధానం ద్వారా నిర్వహించారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు నాగరాజు పేరు ప్రతిపాదించగా, నరహరిశెట్టి నాగమణి బలపరిచారు. దీంతో నాగరాజును వైస్ ఎంపీపీ-2గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందచేశారు. అనంతరం వైస్ ఎంపీపీ-2గా ప్రమాణ స్వీకారం చేయించారు. నాగరాజు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎంపీడీవో వి.శ్రీలత ప్రకటించారు. అనంతరం కొల్లేరు సంఘం సీనియర్ నాయకులు సైదు సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, మాజీ అధ్యక్షుడు నేతల రవి తదితరులు నాగరాజును అభినందించారు. ప్రస్తుతం నాగరాజు మాదేపల్లి-2 ఎంపీటీసీగా ఉన్నారు. వైసీపీ తరపున ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందగా ఇటీవల అతను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు.


నాగరాజుకు ధ్రువీకరణ పత్రం అందజేత

వృద్ధురాలి దారుణ హత్య

లోపలి పేజీలో..

దివ్యాంగులకు.. శాశ్వత కార్డు

- యూనిఫైడ్ ఐడీ పేరుతో గుర్తింపు కార్డు అందించేలా కేంద్రం శ్రీకారం
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- కార్డులు నేరుగా ఇంటికే పంపుతున్న ప్రభుత్వం
- యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలు సులభతరం



ఏలూరురూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శారీరక మానసిక అంధులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శాశ్వత గుర్తింపు కార్డు జారీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఈ సర్టిఫికెట్‌తో బస్సు, రైల్వే పాస్‌లకు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకునేవారు. వీటి స్థానంలో మొత్తంగా కేంద్రం యూడీఐడీ (యూనిఫైడ్ డిజెబులిటీ ఐడెంటీ కార్డు) ఒకే కార్డు తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన ప్రక్రియ జిల్లాలో మొదలైంది. మీ-సేవ, ఇంటర్నెట్, మొబైల్, ఆన్‌లైన్‌లో స్వావలంబన కార్డు జీవోజీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి వివరాలు పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన రాష్ట్రాల్లోను ఈ గుర్తింపు కార్డులతో ప్రయాణ రాయితీలు పొందవచ్చు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుకోవచ్చు. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివ రాలను పొందుపరుస్తున్నారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. వాస్తవానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డును ప్రవేశపెట్టింది. అప్పట్లో మెప్మా అధి కారులు కొంతమందికి పంపిణీ చేసి మిగిలిన వారికి ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ విధానాన్ని అప్‌డేట్ చేసి స్మార్ట్ కార్డును కేంద్రం తీసుకొచ్చి సదరం సులభతరం చేసింది. ఈ-పోర్టల్ ద్వారా సదరం శిబిరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వైద్య పరీక్షలకు ఎక్కడకు, ఎప్పుడు రావాలనే విషయాలు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు. గతంలో ఐదు రకాల వైకల్యాలకు సంబంధించి వ్యాధులకు సదరంలో దరఖాస్తు చేసుకోగా ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18 రకాల వైకల్యాలను చేర్చారు. ఈ కార్డులను నెల రోజుల్లో తపాలాలో ఇంటికే పంపుతారు. లేదంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచుతున్నారు. ఐడీ నెంబర్ చెప్పి కార్డు తీసుకోవచ్చు.

మూడు ఏఎంసీ చైర్మన్ పదవులు భర్తీ

ఏలూరు - పార్థసారథి, దెందులూరు - గారపాటి రామసీత, ఉంగుటూరు- కాలేటి జ్యోతి నియామకం


మామిళ్లపల్లి పార్థసారథి | గారపాటి రామసీత | కాలేటి జ్యోతి

ఏలూరు టూటౌన్/పెదపాడు/ఉంగుటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు ఆగ్రికల్చరల్ మార్కెట్ యార్డు చైర్మన్ పదవులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఏలూరు ఆగ్రికల్చరల్ మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత మామిళ్లపల్లి పార్థసారథి నియమితులయ్యారు. టీడీపీకి గత ఇరవై ఏళ్లుగా సేవలు చేస్తున్న ఆయన సేవలను ఎమ్మెల్యే బడేటి చంటి గుర్తిస్తూ ఏఎంసీ చైర్మన్ పదవికి ఎంపిక చేశారు. 2009 నుంచి పార్థసారథి టీడీపీని అంటిపెట్టుకుని ఉన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే బడేటి బుజ్జి విజయం వెనుక కీలక పాత్ర పోషించారు. ఇటీవల 2024 ఎన్నికల్లోను బడేటి చంటి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి కృషి చేశారు. గతంలో బడేటి బుజ్జి హయాంలోనే ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నిక కావాల్సి ఉండగా కొన్ని సమీకరణాల వల్ల అప్పట్లో పదవి చేజారింది. కాగా ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన పార్థసారథిని పలువురు అభినందించారు.

- దెందులూరు నియోజకవర్గం ఏఎంసీ చైర్మన్‌గా పెదపాడు మండలం కొక్కిరపాడు పంచాయతీ వేంపాడుకు చెందిన గారపాటి రామసీత నియమితులయ్యారు. ఈమె 2006-2011 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో జడ్పీటీసీగా పనిచేశారు. అదే సమయంలో రామసీత తల్లి ముల్పూరి ప్రసునాంబ ఏపూరు సర్పంచిగా పని చేశారు. ప్రస్తుతం టీడీపీలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రామసీతను ప్రభుత్వం ఏఎంసీ చైర్మన్‌గా నియమించడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం, ఎమ్మెల్యే చింతమనేని నాపై నమ్మకం ఉంచి ఏఎంసీ చైర్మన్‌గా నియమించడం నా బాధ్యతను మరింత పెంచింది. ఏఎంసీ అభివృద్ధి నా వంతు కృషి చేస్తా'అని ఆమె తెలిపారు.
- ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో ఉంగుటూరు చెందిన సూరత్తు అయ్యప్ప (రాఘవ) భార్య కాలేటి జ్యోతికి అవకాశం దక్కింది. దీంతో జనసేన కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోను బీసీ మహిళకే కేటాయించారు. కాగా జడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి చెందిన చింతల శ్రీనివాసు భార్య రాజేశ్వరికి చైర్మన్ పదవి దక్కుతుందని ఆశించారు. అయితే పదవి దక్కకపోవడంతో టీడీపీ కేడర్ అసంతృప్తికి గురయ్యారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఇఫ్తార్ విందులో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): సర్వ మానవాళి సుఖసంతోషాలే రంజాన్ ప్రార్థనల ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. ఏలూరులోని గిరిజన భవన్‌లో మైనార్టీస్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని, రంజాన్ ఉపవాసదీక్ష ద్వారా మానసిక, శారీరక పవిత్ర చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమన్నారు. అనంతరం దీక్ష చేసిన చిన్నారులతో, ముస్లిం మతపెద్దలతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కృపావరం, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత పాల్గొన్నారు. కాగా వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణను నిరసిస్తూ కొంత మంది ముస్లిం పెద్దలు ఇఫ్తార్ విందును బహిష్కరించారు.


గిరిజన భవన్‌లో ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, ముస్లిం పెద్దలు

బెదిరించి.. ప్రాణం తీశాడు

- వివాహేతర సంబంధం పెట్టుకుని ఫొటోలు, వీడియోలు
- చనిపోదామంటూ రెండుసార్లు పురుగు మందు తాగించిన యువకుడు.. మహిళ మృతి
- కారకుడిని శిక్షించాలంటూ బంధువుల ఆందోళన

లోపలి పేజీలో..

మంచినీటి కాల్వలే !



ఏలూరు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేది గోదావరి, కృష్ణ కాల్వల నీరే.. కృష్ణా కాల్వ నుంచి ఏలూరు పంపుల చెరువు నింపుతారు. వాటిని మున్సిపల్ అధికారులు క్లోరిన్, ఫిల్టర్ బెడ్స్ ద్వారా శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేస్తుంటారు. ఈ కాల్వలను ఎప్పుడూ శుభ్రం చేయరు. పిచ్చి మొక్కలు, నాచు, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, తూడుతో నీళ్లన్నీ దుర్వాసన వెదజల్లుతుంటాయి. నగరంలోని మూడు లక్షల మంది జనాభాకు తాగునీటిని అందించాల్సిన కాల్వల పరిస్థితి ఇలా ఉంటే ఇక నగర ప్రజల ఆరోగ్యం ఏమి కాను.. అందుకే తరచూ నగర ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు..

బిర్లాభవన్ సెంటర్‌కు వెళ్లు బ్రిడ్జి వద్ద కృష్ణ కాలువ దుస్థితి

మెయిల్ బజార్‌కు వెళ్లు వంతెన వద్ద కాలువలో చెత్తా, చెదారం



-ఫొటోగ్రాఫర్, ఏలూరు

1నే టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్ష : డీఈవో

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహణ తేదీపై నెలకొన్న అస్పష్టతను తొలగిస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోషల్ స్టడీస్ పరీక్షను ఈ నెల 31న కాకుండా ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు నిర్వహిస్తామని వివరించారు. పరీక్ష తేదీ మార్పును జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు.



భీమవరంలో ఎండ నుంచి రక్షణకు ఒక వృద్ధురాలు ఇలా..



ముదినేపల్లిలో స్కూలు నుంచి పిల్లలను గొడుగు నీడన ఇంటికి తీసుకు వెళుతున్న తల్లి

ఎండల్లో జాగ్రత్త

లింగపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రజలు వడదెబ్బ భారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ? ఏ విధమైన వైద్య సేవలు పొందాలనే విషయాలను డాక్టర్ లింగపాలెం మండలం కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ ఆంధ్రజ్యోతికి వివరించారు.



డాక్టర్ కృష్ణకిషోర్, కే.గోకవరం పీహెచ్‌సీ, లింగపాలెం మండలం

- ఎండ ఎక్కువగా ఉండే సమయంలో అంటే ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకూడదు. తప్పని పరిస్థితులలో బయటకు వెళ్లవలసి వస్తే తప్పకుండా తెల్లని దుస్తులు, తలకు టోపీ, రుమాలు కళ్లజోడు ధరించాలి. లేదంటే డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- ఎండాకాలంలో శరీరంలో నీటిశాతం తగ్గడం వల్ల శరీరంలో శక్తి తగ్గి డీహైడ్రేషన్‌కు గురవుతారు. ప్రతిరోజూ తప్పకుండా 8 నుంచి 10 గ్లాసులనీరు తాగాలి. తాజా ఆహారాన్ని తీసుకోవాలి. బిర్యానీలు, ఆయిల్‌ఫుడ్స్, మసాలాలతో కూడిన ఆహారం తగ్గించి ఎక్కువగా కొబ్బరినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుంటే మంచిది.
- శరీరంలో టెంపరేచర్ పెరిగినప్పుడు ఆ వ్యక్తి ఒంటిపై దుస్తులు తీసివేసి ముఖం, శరీర భాగాలను చల్లని నీటితో తుడవాలి. గాలి బాగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. లేదంటే ఆ వ్యక్తి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.
- జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్యులు, మందులు అందుబాటులోనే ఉన్నాయి. ప్రతి గ్రామం లోనూ అంగన్‌వాడీ కేంద్రాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. ఉపాధిహామీ కూలీలకు కూడా వారి పనిచేసే స్థలాలలో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది .
- గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు హైరిస్క్‌లో ఉంటారు. అలాంటివారు ఎండల్లో తిరగక పోవడమే మంచిది. ఎవరైనా డీహైడ్రేషన్‌కు గురైతే వెంటనే మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మకాయ ఉప్పు కలిపిన నీరు, ఓఆర్ఎస్ ద్రావణం లాంటివి తాగించాలి. చల్లనిగాలి తగిలేలా చూడాలి.

వడదెబ్బ లక్షణాలు..జాగ్రత్తలు

పోలవరం (ఆంధ్రజ్యోతి) : తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం రావడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, లేదా పూర్తి అపస్మారక స్థితి కలిగి ఉండడం వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలి. వడదెబ్బకు గురి అయిన వారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలి. శరీరంలో ఉన్న అదనపు ఉష్ణాన్ని నియంత్రించాలి. చల్లని బట్టతో తుడుస్తూ ఉండాలి. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే వారిని శీతల వాతావరణంలో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. వీలైనంత ఎక్కువ నీరు తాగించాలి. ఇంటినుంచి బయటకు వెళ్ళే ముందు అవసరమైనంత మంచినీరు తాగాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, మజ్జిగ , మంచి నీరు లాంటివి తాగాలి. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్ళినప్పుడు తల తిరుగుడు మొదలైన అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. నలుపు రంగు దుస్తులు మందంగా ఉండేవి ధరించ కూడదు. బయటకు వెళ్ళేటప్పుడు వెంట మంచినీళ్ళ బాటిల్, గొడుగు, చెవులు కప్పుకునేలా రుమాలు వంటివి తీసుకెళ్లడం మంచిది.

భీమవరం రైల్వేస్టేషన్ ఇక కొత్తగా..

రూ. 32 కోట్లతో అభివృద్ధి

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం కొత్త శోభ సంతరించుకోబోతున్నన్నది. ఆక్వా, విద్య, వైద్య రంగాల్లో పెట్టింది పేరుగా ఉన్న భీమవరం పట్టణానికి రవాణా కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతుంది. నిడదవోలు టు గుడివాడ, భీమవరం టు నరసాపురం, గుడివాడ నుంచి విజయవాడ, గుడివాడ - మచిలీపట్నం డబ్లింగ్ రైల్వే లైన్ పనులు పూర్తయినప్పటి నుంచి కొత్త రైళ్లు పెరిగాయి. అలాగే రవాణాకు ఉపయోగించే గూడ్స్ రైళ్ళు కూడా భారీగా పెరగడంతో రైల్వే శాఖ కొత్త పుంతలు తొక్కనుంది. దీనిలో భాగంగానే అమృత్ భారత్ రైల్వే స్టేషన్స్‌లను కేంద్రం ఎంపిక చేసింది. దానిలో భాగంగా జిల్లాలోని నరసాపురం, భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. కొత్తగా స్టేషన్లను పునర్ నిర్మించడం కోసం భీమవరం టౌన్ స్టేషన్‌కు రూ. 32.37 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 55 శాతం పనులు పూర్తయినట్లు రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు సగటున భీమవరం టౌన్ స్టేషన్‌కు 7,587 మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఏడాదికి టౌన్ రైల్వేస్టేషన్‌కు రూ. 33.20 కోట్లు ఆదాయం వస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కొత్త టెక్నాలజీతో రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే ఇంకా ప్రయాణికుల సంఖ్యతో పాటు రైళ్ల రాకపోకలు కూడా పెరిగే అవకాశం ఉన్నట్లుగా కొందరు ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికే అంబేడ్కర్ సెంటర్ నుంచి డీ మార్ట్ వరకు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో పట్టణానికి కొంత కొత్త శోభ కనబడుతుంది. అలాగే ఉండి రోడ్డులోని రైల్వే గేటు వద్ద కూడా అండర్ టన్నెల్ కానీ, ఆర్‌వోబీ గాని నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా రాబోయే రోజుల్లో భీమవరాన్ని కొత్త శోభతో చూడబోతున్నాం.



భీమవరం కొత్త రైల్వేస్టేషన్ నమూనా



ప్రస్తుత రైల్వేస్టేషన్ భవనం



విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న ఉగాది మండప పరిసరాలు

విద్యుద్దీప కాంతుల్లో ఉగాది మండపం

ద్వారకాతిరుమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఉగాది ఉత్సవానికి మండపాన్ని విద్యుత్ దీప తోరణాలతో అలంకరించారు. శ్రీవారు, పద్మావతి అమ్మవారి భారీ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం స్వామివారు, ఉభయ దేవేరులతో కలసి వెండి శేషవాహనంపై ముందుగా తిరువీధుల్లో విహరిస్తారు. అనంతరం ఉగాది మండపానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీరుతారు. అర్చకులు పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. తరువాత దాతలకు, పండితులకు సత్కార కార్యక్రమం ఉంటుందని భక్తులు తరలిరావాలని ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి కోరారు.

కోండ్రుకోట పునరావాస కాలనీలో దుర్గాదేవి జాతర



పోలవరం మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం ఎల్లండీపేట సమీపంలో ఉన్న కోండ్రుకోట పునరావాస కాలనీలో శుక్ర వారం మూడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన కనక దుర్గమ్మ జాతర పనులు గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంధ సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ మాట్లా డుతూ కోండ్రుకోట పాత గ్రామంలో 300 సంవత్సరాల వయసు కలిగిన పాశి వృక్షం కింద మూడు వందల సంవత్సరాల క్రితం గిరిజన ఆదివాసి పెద్దలు ప్రతిష్ఠించి పూజాధికాలు నిర్వహించేవారన్నారు. ప్రతిఏటా జాతర నిర్వహించేవారన్నారు. అదే విగ్రహాలతో పునరావాస గ్రామంలో నిర్మించిన ఆలయం వద్ద శని ఆది వారాలలో జాతర నిర్వహించనున్నామని,ఇక్కడకు వచ్చిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా జాతర నిర్వహిస్తున్నామని కోండ్రుకోట గ్రామ పరిధి గ్రామాలన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ప్రదర్శనకు వచ్చిన లేగ దూడలను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

తక్కెళ్లపాడులో లేగ దూడల ప్రదర్శన

ద్వారకాతిరుమల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు లేగదూడల పోషణలో మెళకువలను పాటించడంతో పాటు శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సాయిరమేష్ అన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని తక్కెళ్లపాడులో శుక్రవారం పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన జరిగింది. ఇందులో 25 గేదె దూడలు, 15 హైబిడ్ ఆవుదూడలను రైతులు తీసుకొచ్చారు. 30 దూడలకు బ్రూసెల్లా టీకాలను వేశారు. అనంతరం పశుపోషణ, జాతి లక్షణాలు ఆధారంగా రైతులకు బహుమతులను అందించారు. పాల్గొన్న ప్రతీ రైతుకు కాల్షియం, లివర్ టానిక్, గోమర్లు మందు, స్టీల్ క్యాన్‌లను బహుమతిగా అందజేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, డాక్టర్ హరి కృష్ణ, పాడిరైతులు బి.సూర్యనారాయణరెడ్డి, మానికల రామకృష్ణ, ముల్లంగి కృష్ణారెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధక అధికారులు

అయోమయంలో జామాయిల్ రైతు

అంతకంతకు తగ్గుతున్న ధర

టన్ను రూ.7,800 నుంచి రూ.6,500కి పతనం

కుక్కునూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో విస్తారంగా సాగవుతున్న జామాయిల్ సాగు రైతాంగానికి నష్టాలు కలిగించే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం వరకు టన్ను జామాయిల్ ధర రూ.7800 వరకు పలికింది. క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం టన్ను ధర రూ.6500కి పడిపోయింది. జామాయిల్ ధర నిలకడగా లేకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తుంది. జామాయిల్ కొనుగోలు చేసే కంపెనీలు వారి అవసరాలకు అనుగుణంగా ధర పెంచడం అనంతరం తగ్గించడం చేస్తున్నారు. అదే విధంగా కంపెనీలన్నీ సిండికేట్ అయ్యి ధరను తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ధర తగ్గటానికి అటవీశాఖ నుంచి విస్తారంగా జామాయిల్ కర్ర కంపెనీలకు తరలివెళ్లడమే కారణం. దాదాపు 20 ఏళ్ల క్రితం అటవీ శాఖ గ్రామాల్లోని వనసంరక్షణ సమితి (వీఎస్ఎస్) సభ్యులు సంయుక్తంగా జామాయిల్ పంట వేశారు. ఈ ఏడాది అటవీశాఖ ద్వారా పెంచబడిన జామాయిల్‌కు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీంతో వేలాది టన్నుల జామాయిల్ కర్ర కంపెనీలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల నుంచి విస్తారంగా కొనుగోలు చేసే కర్మాగారాలన్నీ ధరను క్రమక్రమంగా తగ్గించేస్తున్నాయి. దీంతో వెయ్యి నుంచి రూ.1500వరకు టన్ను ధర తగ్గిపోయింది. గత ఏడాది టన్ను జామాయిల్ ధర రూ.5500 ధర పలికింది. ఈ క్రమంలో గత ఆరునెలల నుంచి క్రమక్రమంగా ధర పెరుగుతూ టన్ను రూ.7800కి చేరింది. ప్రతీ ఏటా పత్తి, మిర్చి సాగు చేసిన రైతాంగం నష్టాలను చవిచూడటంతో పెరిగిన జామాయిల్ ధరను చూసి అందరూ ప్రత్యామ్నాయ పంటగా జామాయిల్ పంట వైపు ఆసక్తి కనపరిచారు. దీంతో రైతులు పోటీపడి జామాయిల్ సాగు చేయడానికి ముందుకొచ్చారు. కుక్కునూరు మండలంలో అల్లిగూడెం, పెద్దరావిగూడెం, భువనగిరి ప్రాంతాల్లో పెంపకం సాగుతున్న జామాయిల్ నర్సరీల నుంచి దాదాపు 15 కోట్ల మొక్కలను రైతాంగం కొనుగోలు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేపట్టారు. ఎన్నో ఆశలతో జామాయిల్ సాగు ఆరంభిస్తే క్రమక్రమంగా ధర తగ్గటం రైతాంగంలో ఆందోళన నెలకొంది. ఎన్నో ఆశలతో లాభాలు గడించవచ్చని



రైతులు ఎకరం జామాయిల్ సాగు చేయడానికి రూ.10 వేలకు పైగా కౌలుకు తీసుకుని మరీ సాగు ఆరంభించారు. ధర ఎక్కువగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉంది. కానీ ధర తగ్గితే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పత్తి, మిర్చి పంటతో నష్టపోతున్న రైతాంగం ఎన్నో ఆశలతో జామాయిల్ సాగు వైపు దృష్టి పెట్టగా ఇప్పుడు ధర కూడా పతనం కావడంతో ఏం చేయాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

కోర్టు సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కోర్టులలో పని చేస్తున్న 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.సునీల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారికి వివిధ కోర్టులలో పోస్టింగులు కల్పించారు. మరో 15 మంది వివిధ కోర్టుల సూపరింటెండెంట్లుగా బదిలీలు చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఎస్.మల్లేశ్వర గుప్తా, జీపీ హెప్సిబా, పి.భాస్కరరావు, ఎన్.పట్టాభి రామరాజు, ముక్కు శ్రీనివాసరావు, కె.గంగరాజు, ఎం.ధర్మారావు, ఎస్.శివగిరి, పి.గురివినాయుడు, కె.రాజ్యలక్ష్మి ప్రభ, జి.శిరీషలు ఉన్నారు.



ముచ్చటగొలిపే మట్టిపాత్రలు

జాతీయ రహదారిపై రాజస్థాన్ వాసుల అమ్మకాలు

పాత రోజులు మళ్లీ వస్తున్నాయి. జనం మట్టి పాత్రలపై మోజు పడుతున్నారు.. ఆరోగ్యరీత్యా అల్యూమినిం పాత్రల నుంచి దూరం జరుగుతూ మట్టితో చేసిన కుండలు, కడాయిల వైపు చూస్తున్నారు. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన ఓ కుటుంబం ప్రత్యేకమైన మట్టితో తయారు చేసిన పాత్రలు, నీళ్లసీసాలు, కడాయిలను జాతీయ రహదారిపై అమ్మకాలు సాగిస్తున్నారు. వాహనాలపై సామాగ్రి వేసుకుని జాగా దొరికిన చోట దుకాణం పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. రోజూ రెండు నుంచి మూడు వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నామని మట్టి పాత్రలకు మంచి ఆదరణ లభిస్తుందని వారు చెబుతున్నారు. మట్టి పాత్రలతో పాటుగా చిన్న పిల్లలను ఆకర్షించేలా కారు బొమ్మలు, కుర్చీలు, స్టడీ, ల్యాప్‌టాప్ టేబుళ్లను అమ్ముతున్నారు.. పెదపాడు మండలం కలపర్రు జాతీయ రహదారిపై విక్రయిస్తున్న దృశ్యం

-పెదపాడు (ఆంధ్రజ్యోతి)





గేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఏపీ నిట్ ప్రొఫెసర్లు

నిట్ నుంచి గేట్

జాతీయ స్థాయి ర్యాంకులతో సత్తా చాటిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాలలో తాడేపల్లిగూడెం ఏపీ నిట్ విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. జాతీయ స్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. బీటెక్ విద్యార్థులు కె.నవ్య (బయోటెక్నాలజీ) 8వ ర్యాంకు, సీహెచ్.దినేష్ (ఈసీఈ) 23వ ర్యాంకు, డి.వర్ధన్ (ఎలక్ట్రికల్) 40వ ర్యాంకు, శ్రీధర్ వర్మ కలిదిండి (సీఎస్ఈ) 56వ ర్యాంకు, కె.కళాతులసి(బయో ఇన్నొవేటివ్ ఇంజనీరింగ్) 102వ ర్యాంకు, అతిధి అనన్య (ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్) 164వ ర్యాంకు సాధించారు. నలుగురు 100లోపు ర్యాంక్‌లు సాధించగా, 10 మంది 500లోపు, 12 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు. ఏపీ నిట్‌లో విద్యార్థులకు ప్రతీ సంవత్సరం గేట్ రాయడానికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ మంచి ర్యాంకులు సాధించడానికి దోహదపడిందని విద్యార్థులు తెలిపారు. ఇంజనీరింగ్ తరువాత ఎంటెక్‌లో చేరి ఉన్నత విద్యనభ్యసించడంతో పాటు కొన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో కొలువుల సాధనకు గేట్ ర్యాంకులను ప్రామాణికం. దీంతో ఏపీ నిట్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు సాధించిన విజయం సంస్థకు ఎంతో గర్వకారణమని ఆచార్యులు చెబుతున్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం, గేట్ ఉచిత శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వినోద్‌కుమార్‌రాజా తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి

మాది విజయవాడ. మా నాన్న కె.శ్రీనివాసరావు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మా అమ్మ సుధారాణి గృహిణి. నేను ఏపీ నిట్‌లో బయోటెక్నాలజీ చదువుతున్నాను. గేట్‌లో 8వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. మా సంస్థలో గేట్ ఉచిత శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించా లనేది నా లక్ష్యం. - **కె.నవ్య, బయోటెక్నాలజీ**



విదేశాల్లో ఉన్నత చదువుకు వెళతా

మాది విశాఖపట్నం. ఏపీ నిట్‌లో ఈసీఈ చదువుతున్నాను. నాన్న హరి శివప్రసాద్, అమ్మ సుజాత. గేట్ పరీక్షలో 23వ ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉంది. నిట్‌లో ఆచార్యులు మా చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కాబట్టే మేము చదువులో ఇలా రాణిస్తున్నాం. విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవాలనేది నా కోరిక. **- సీహెచ్ దినేష్, ఈసీఈ**



ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లక్ష్యం

మాది వరంగల్. మా నాన్న కుమారస్వామి సివిల్ ఇంజనీర్. అమ్మ స్వప్న గృహిణి. గేట్‌లో సంస్థ అందిస్తున్న శిక్షణ మా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది. ప్రశ్నలు ఎలా వస్తాయి, జవాబులు ఎలా రాయాలనే దానిపై మంచి శిక్షణ ఇచ్చారు. నేను గేట్‌లో 40వ ర్యాంకు సాధించగలిగాను. భవిష్యత్‌లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో స్థిరపడాలనేని నా లక్ష్యం. **- డి.వర్ధన్, ఎలక్ట్రికల్**

కదలి వచ్చిన అధికారులు

మొగల్తూరు, పెనుగొండలో గ్రామాభివృద్ధి సభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పేషీ అధికారులు



మొగల్తూరు గ్రామాభివృద్ధి సభలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ

మొగల్తూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ తెలిపారు. గ్రామ సర్పంచ్ పడవల మేరీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామాభివృద్ధి సభలో కృష్ణ తేజ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. తమను మొగల్తూరులో గ్రామసభ నిర్వహించి అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. ప్రజలు మన వద్దకు రావడం కాదు, మనమే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని చెప్పడంతో గ్రామ సభ ఏర్పాటు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన అవకాశాన్ని గ్రామస్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అభివృద్ధికి దూరంగా ఉన్నాం

ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. సముద్ర తీరం కావడంతో ప్రజల దాహార్తి తీరాలంటే కాలువ నీరు మాత్రమే ఆధారమని, భూమి నుంచి మంచినీరు లభ్యం కాదన్నారు. ఉప్పునీటి ప్రాంతం కావడం, ఒక పక్క సముద్రం, మరోపక్క గోదావరి, ఉప్పుటేరుల మధ్య జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మొగల్తూరులో తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య, రహదారి సదుపాయాలు కల్పనకు పవన్ సిద్ధంగా ఉన్నారన్నారు.

ఏమి కావాలో చెప్పండి అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను పంపించారని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. గ్రామస్తులు సూచించిన పనులకు ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన పరిష్కారం చేస్తారన్నారు. విజ్జేశ్వరం నుంచి మంచినీటి ప్రాజెక్టులకు నేరుగా పైప్‌లైన్ ద్వారా నీరందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు కోరారు. మాజీ సర్పంచ్‌లు మామిడిశెట్టి సత్యనారాయణ, శ్రీరాజా కలిదిండి కుమార్ బాబు, పడవల సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, గ్రామస్థులు, సమీప గ్రామాల సర్పంచ్‌లు, రైతులు సమస్యలపై వినతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, డీపీవో అరుణశ్రీ, డీసీఎం పేషీ అధికారులు ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణ, జీఆర్ మధుసూదన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ, మార్చి28(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు మేరకు పెనుగొండలో నిర్వహించిన గ్రామాభివృద్ధి సభలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్థలు సమస్యలు ఏకరువు పెట్టారు. పవన్ కల్యాణ్ తండ్రి వెంకట్రావు స్వగ్రామం కావడంతో అభివృద్ధిపై ప్రతిపాదనలకు డీసీఎం పేషీ అధికారులను పంపించారు. టీటీడీ కల్యాణ మండపంలో వినతిపత్రాలు స్వీకరించారు.

తొలి పారిశ్రామిక పట్టణంగా పెనుగొండకు ఖ్యాతి ఉందని, పెనుగొండలో ఇనుము ఫ్యాక్టరీ ఉన్న కాలంలో సుమారు 500 మంది కార్మికులు పని చేసేవారన్నారు. పెనుగొండను పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు.

- పారిశుధ్యం మెరుగుదల, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరారు.
- పెనుగొండ కళాశాల వద్ద కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.
- పెనుగొండ - మార్టేరు కాలువగట్టు రహదారి అభివృద్ధి చేయాలని, బీడు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు.



పెనుగొండ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

- సిద్ధాంతంలో పవిత్ర వశిష్ఠ నదీ తీరంలో కైలాస భూమి అభివృద్ధి చేయాలని, పెనుగొండలో శ్మశాన వాటిక, ఎస్సీ శ్మశాన వాటికల అభివృద్ధి చేయాలని కోరారు.
- ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డుకు రెండున్నర ఎరాలు కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు.
- పెనుగొండలో ఆధ్యాత్మిక శోభకు అనుగుణంగా గ్రీన్ సిటీగా తీర్చిదిద్ది వాసవి ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు.

నివేదిక తయారుచేసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నివేదిస్తామని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. ప్రతీ సమస్య డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలిస్తారని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అన్ని పనులు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ఫారెస్ట్ ఎస్‌పీఎఫ్ కృష్ణ, పీఏ.బాలకృష్ణ, తహసీల్దార్ అనితకుమారి, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పని చేయండి

అధికారుల తీరుపై కేంద్ర మంత్రి అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సమన్వయం, చిత్తశుద్ధితో పనిచేస్తే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) సమావేశంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. సమీక్ష సమావేశాలకు కొంతమంది జిల్లా అధికారులు హాజరు కాకపోవడం, కింది స్థాయి అధికారులను పంపడంపై కేంద్ర మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించే సమావేశాలకు జిల్లా స్థాయి హాజరు కాలేని పక్షంలో కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. అధికారులు ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోకుండా ప్రొటోకాల్ ప్రకారం నిబంధన మేరకు పనిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపట్టిన పనులు ప్రగతి, ఖర్చు వివరాలపై కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారుల వివరణ కోరారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి జడ్డు వెంకటేశ్వరరావు, సీపీవో కె.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఈవో ఇ.నారాయణ, జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

పీఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకంలో భీమవరం ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.23.75 కోట్లు మంజూరయ్యాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చేనెలలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భీమవరంలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు సహకరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శ్రీనివాసవర్మ కృతజ్ఞతలు తెలిపారు. అమృత్ భారత్ పథకంలో తాడేపల్లిగూడెం, భీమవరం టౌన్, నరసాపురం రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. భీమవరం టౌన్ స్టేషన్‌లో రూ.32.37 కోట్లతో చేపట్టిన పనులు 55 శాతం పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సీఎస్ఆర్ నిధులను తీసుకురావడం జరిగిందని, మరిన్ని నిధులను సాధించి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

భార్య మరణం తట్టుకోలేక..

రైలు కిందపడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్య మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె జ్ఞాపకాలను పదే పదే గుర్తు చేసుకుని కుమిలిపోతూ, తానూ కూడా భార్య వద్దకే వెళ్లిపోవాలని భావించాడు. చివరికి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు లంకపేటకు చెందిన పిల్లి గురుమూర్తి(77) భార్య ఆరేళ్ల క్రితం మరణించింది. ఆమె జ్ఞాపకాలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్ చివర రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

దెందులూరు,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దళితవాడకు చెందిన గుంపుల వంశీ, కొల్లబత్తుల ఏసు కూలి డబ్బుల కోసం మోటార్‌సైకిల్‌పై శ్రీరామవరం వెళుతున్నారు. శ్రీరామవరం వైపు నుంచి కూలీలతో వస్తున్న ఆటో మోటార్‌నుసైకిల్‌ను ఢీ కొంది. మోటార్ సైకిల్ వెనుక కుర్చున్న కొల్లబత్తుల ఏసు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్ నడుపుతున్న గుంపుల వంశీ తీవ్రగా గాయపడ్డాడు. వంశీని స్థానికులు అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఏసుకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఏసు మృతదేహాన్ని ఏలూరు ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు అద్దెకు కావాలంటూ..

వృద్ధురాలిపై బ్లేడుతో దాడి

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి వృద్ధురాలిపై ఒక వ్యక్తి బ్లేడుతో దాడి చేశాడు. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మిరాజు తోటలో నివాసం ఉంటున్న యర్రంశెట్టి మంగతాయారు ఇంటికి శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. దూరపు బంధువును అంటూ ఆమెను నమ్మించాడు. ఇల్లు చూసిన అనంతరం మంగతాయారుపై చైనా బ్లేడుతో దాడి చేశాడు. అనంతరం వృద్ధురాలి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకుని పరారయ్యాడు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ జయసూర్య, సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఘట నాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన..

నిందితుడిపై పోక్సో కేసు

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రెండో భార్య కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై టూటౌన్ పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఫాజిల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం రెండవ పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఉంటున్న ఒక మహిళ భర్తతో సుమారు పదేళ్ల నుంచి దూరంగా ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. అప్పటి నుంచి మరొకరితో ఆమె సహజీవనం చేస్తుంది. మళ్లీ ముగ్గురు పిల్లలు జన్మించారు. ఆ మహిళ బయటకు వెళ్లిన సమయంలో రెండో భర్త కె.గణేష్ మణికంఠ ఆమె మొదటి భర్త కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడు. ఆ విషయాన్ని ఆ బాలిక తల్లితో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

30, 31 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి

2 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

ఏలూరు/ఆచంట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈ నెల 30, 31 సెలవు దినాలు అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యాలు పూర్తి చేసేందుకు అనువుగా ఈ రెండు రోజులు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేస్తాయని సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 వరకు పని చేయనున్నాయి. సెలవు దినాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కక్షిదారులు సద్వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. దీంతో పాటు ఏప్రిల్ 2 నుంచి రిజిస్ట్రేషన్లు శాఖ స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందని ఏలూరు జిలా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నిర్ణీత వేళల్లో స్లాట్ బుకింగ్ సమయంతో పాటు రిజిస్ట్రేషన్లు అతి త్వరగా చేసుకోవచ్చని అయన తెలిపారు.

నరసాపురం నుంచి ప్రత్యేక రైలు

నరసాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) నరసాపురం నుంచి యశ్వంత్‌పూర్‌కు సమీప స్టేషన్ యలహంకా మీదుగా కర్ణాటకలోని ఆరిశికరే వరకు ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేక రైలు నడపనున్నారు. ఆయా నెలల్లో ప్రతి ఆదివారం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు శుక్రవారం తెలిపారు. 07201 నెంబర్‌తో ఆదివారం మధ్యాహ్నం 2.20 గంటలకు నరసాపురంలో బయలు దేరుతుందన్నారు. గుంటూరు, నంద్యాల, అనంతపురం, ధర్మవరం, హిందూపురం మీదుగా ఉదయం 8.55కు యశ్వంత్‌పూర స్టేషన్‌కు సమీపంలోని యలహంక జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. తిరిగి అక్కడ 9గంటలకు బయలుదేరి చిక్‌బన్వర్ మీదుగా మధ్యాహ్నం 12.45 గంటలకు ఆరిశికరే వెళుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఆయా నెలల్లో ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 07202 నెంబర్‌తో ఆరిశికరేలో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు నరసాపురం చేరుతుందన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మీదుగా నడుస్తున్న 2 ప్రత్యేక రైళ్లను వేసవి రద్దీ దృష్ట్యా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. రైల్ నెంబర్ 07165 హైదరాబాద్ నుంచి కటక్ వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి మంగళవారం నడుపుతున్నారు. ఈ రైలును ఏప్రిల్ 1 నుంచి జూన్ 24 వరకూ నడపనున్నారు. రైల్ నెంబర్ 07166 కటక్ నుంచి హైదరాబాద్ ప్రతి బుధవారం నడుస్తున్న ప్రత్యేక రైలు ఏప్రిల్ 2 నుంచి జూన్ 25 వరకూ వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

- కాళ్లు, చేతులు కట్టి.. నోట్లో చీరను కుక్కి, మెడకు ఉరి.. పెట్రోలు పోసి నిప్పు
- ఏలూరులో దుండగుల కిరాతకం
- 10 కాసుల బంగారం, నగదు అపహరణ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ అస్మీ (ఇన్‌సెట్) రమణమ్మ (ఫైల్)

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జరిగిన సంఘటన వెలుగు వచ్చిన తర్వాత స్థానికులకు తెలియడంతో ఒక్కసారి భయభ్రాంతులకు గురయ్యారు. ఒంటరిగా ఉంటున్న చనపతి రమణమ్మ (65) చీటీల వ్యాపారం నిర్వహిస్తుంది. ఆమెను దుండగులు తాళ్లతో కాళ్లు, చేతులు కట్టి, నోటిలో కాటన్ చీర కుక్కి, మెడకు నైలాన్‌తాడుతో ఉరి బిగించి హతమార్చారు. తరువాత పెట్రోలు పోసి నిప్పంటించేశారు. ఎలాంటి సాక్ష్యం లేకుండా చేయడానికి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు వెన్నవల్లివారిపేటలో నివాసం ఉంటున్న చనపతి రమణమ్మ (65) భర్త రాఘవరావు 20 ఏళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. రమణమ్మ కుమార్తె రాజ్యలక్ష్మికి నవాబుపేటకు చెందిన ఎల్ఐసీ ఏజెంటు పెంటా శ్రీనివాసరావుతో వివాహం చేశారు. రమణమ్మ ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నారు. ఎదురుగా ఉన్న మరో రేకు షెడ్డును అద్దెకు ఇచ్చింది. గురువారం రాత్రి 10.30 గంటలకు ఇరుగు పొరుగువారితో మాట్లాడిన తర్వాత ఆమె నిద్రపోయింది. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సమీపంలోని ఒక ఇంటి వారి కుక్క పెద్దగా మొరగడంతో రాఘవమ్మ ఇంట్లో అద్దెకు ఉంటున్న కిరణ్ బయటకు వచ్చి చూశాడు. రమణమ్మ ఇంటి నుంచి మంటలు, పొగ విపరీతంగా రావడం గమనించాడు. వెంటనే ఆమె అల్లుడు శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పాడు. శ్రీనివాసరావు వచ్చిన తరువాత మంటలను కూడా ఆర్పారు. రమణమ్మ కాళ్లు, చేతులు కట్టివేయబడి, నోటిలో చీర కుక్కివేసి పెట్రోల్ పోసి అంటించినట్లు గుర్తించారు. మెడకు నైలాన్ తాడుతో ఉచ్చు బిగించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐలు జి.సత్యనారాయణ, వైవి రమణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ఇన్‌చార్జి ఎస్పీ అద్నాన్ నయామ్ అస్మి, ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీసీఎస్ సీఐ రాజశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, భీమడోలు సీఐ యుజె విల్సన్, బృందాలు రంగంలోకి దిగాయి. ఎస్పీ సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్స్, పోలీసు జాగిలంతో పరిశీలించారు. వృద్ధురాలి మెడలో నాన్‌తాడు, గాజులు, చెవి దిద్దులు మొత్తం పది కాసుల బంగారు ఆభరణాలు, బీరువాలోని రూ.25 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అల్లుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆమె ఎవరెవరికి చీటీలు ఇచ్చారు, కట్టాల్సిన వారు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

హంతకుడి గుర్తింపు?

చనపతి రమణమ్మ వద్ద చీటీల సొమ్ము పాడుకుని తిరిగి చెల్లించకుండా ఉన్నవారి వివరాలపై పోలీసులు ఆరా తీశారు. పూల కొట్టులో పనిచేసే ఒక యువకుడు సుమారు రూ.2.5 లక్షలు చెల్లించకుండా ఆమెను బెదిరిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేరానికి అతనే పాల్పడి ఉంటాడని ప్రాథమిక అంచనాతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అతను ఒక్కడే ఈ నేరం చేశాడా? ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

బెదిరించి.. ప్రాణం తీశాడు

- మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఫొటోలు, వీడియోలు
- చనిపోదామంటూ రెండు సార్లు పురుగు మందు తాగించిన యువకుడు
- మహిళ మృతి.. కారకుడిని శిక్షించాలంటూ బంధువుల ఆందోళన



ఆందోళన ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలిస్తున్న బంధువులు

జంగారెడ్డిగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళను బలవంతంగా లోబరుచుకుని వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఆమెతో ఏకాంతంగా గడిపిన ఫొటోలు, వీడియోలు తీశాడు. తన మాట వినకపోతే పరువు తీస్తానంటూ బెదిరించాడు. తర్వాత ఇద్దరం చనిపోదామంటూ పురుగు మందు తెచ్చాడు. ఆమెతో పురుగుమందు తాగించి పారిపోయాడు. ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన దార్ల హేమదుర్గ ప్రసన్న (31) మృతదేహంతో ఆమె మృతికి కారణమైన యువకుడి ఇంటి వద్ద బంధువులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మృతురాలి తండ్రి ఈశ్వరాచారి ఫిర్యాదుతో జంగారెడ్డిగూడెం ఎస్ఐ ఎస్‌కే.జబీర్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..

జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన గెడ్డం ఈశ్వరాచారి కుమార్తె హేమదుర్గకు 2014లో కొయ్యలగూడెం మండలం యర్రంపేట గ్రామానికి చెందిన దార్ల రాంప్రసాద్‌తో వివాహమైంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మోదుగ పెద్దసాయి ఆమె వెంటపడి బలవంతంగా లోబరుచుకున్నాడు. ఇద్దరూ ఏకాంతంగా గడిపిన ఫోటోలు, వీడియోలు సెల్‌ఫోన్‌లో తీసి తన మాట వినకపోతే సోషల్ మీడియాలో పెట్టి పరువుతీస్తానని ఆమెను బెదిరించాడు. ఫిబ్రవరి 7న యర్రంపేటలోని హేమదుర్గ ఇంటికి వెళ్లిన పెద్దసాయి ఇద్దరం కలిసి పురుగుమందు తాగి చనిపోదామని చెప్పి ఆమెతో పురుగుమందు తాగించాడు. గమనించిన స్థానికులు ఆమెను కొయ్యలగూడెం ఆసుపత్రిలో చేర్పించగా వారం రోజులు చికిత్స అనంతరం ఆమె పేరంపేటలోని తండ్రి ఇంటి వద్ద ఉంటుంది. 15 రోజుల తర్వాత పేరంపేటలో ఉంటున్న మహిళ వద్దకు మోదుగ పెద్దసాయి వచ్చి గొడవ పెట్టుకుని వెళ్లాడు. మరోసారి ఈ నెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెద్దసాయి పురుగు మందు డబ్బా తీసుకు వచ్చి ఇద్దరం చనిపోదామని ఆమెను ప్రేరేపించాడు. ఆమె నొప్పితో కేకలు వేయడంతో పెద్ద సాయి పారిపోయాడు. వెంటనే బంధువులు, స్థానికులు జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనితో మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

మృతదేహంతో నిరసన

వివాహేతర సంబంధం పెట్టుకుని, మహిళను పురుగుమందు తాగేలా ప్రేరేపించి ఆమె మృతికి కారణమైన మోదుగ పెద్దసాయి ఇంటివద్ద మృతదేహంతో ఆమె కుటుంబసభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆమె మృతికి కారణమైన పెద్దసాయిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని యర్రంపేట తీసుకువెళ్లారు. యర్రంపేట నుంచి గంగన్నగూడెం మృతదేహంతో దర్నా నిర్వహిస్తారని తెలుసుకున్న కొయ్యలగూడెం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై గంగన్నగూడెం తీసుకువెళ్లి ఆందోళన చేపట్టారు. రాత్రి 11 గంటల వరకు ఆందోళన కొనసాగింది.

ప్రశాంతంగా జీవశాస్త్రం పరీక్ష

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు రెగ్యులర్ విభాగంలో 23,070మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 22,428మంది, వన్స్‌ఫెయిల్డ్ విద్యార్థులు 1357మందికి 1119మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విభాగంలో జరిగిన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు 638మంది అభ్యాసకులు దరఖాస్తుచేసుకోగా 537మంది హాజరయ్యారని వివరించారు.

సీఆర్ఆర్ పీజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి0 : స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల 2024-25 పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం కళాశాల కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు విడుదల చేశారు. విద్యార్థులు తమ పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చునన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఫణికుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పాటిమ్మ ఉత్సవాలు

దెందులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లచింతలపూడి - పెరుగుగూడెం గ్రామాల మధ్య వెలసిన గ్రామ దేవత, యలమర్తివారి ఆడపడుచు పాటిమ్మ పేరంటలమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం చైర్మన్ యలమర్తి శ్రీను మాజీ సర్పంచ్ హేమలత దంపతులు తెలిపారు, 31వ తేదీన 108 కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. నిప్పుల గుండం తొక్కుతారు. 4వ తేదీన అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

రేపటి నుంచి అంకమ్మ ఉత్సవాలు

దెందులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కొవ్వలి గ్రామ దేవత గోవాడ అంకమ్మతల్లి ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి 2 వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ గోవాడ నాగరాజు తెలిపారు. ఉగాది సందర్భంగా జాతర నిర్వహిస్తామని, ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 2వ తేదీన అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ జాతర



ఏలూరు కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలో ఈనెల 20వ తేదీన ప్రారంభమైన గ్రామదేవత నూకాలమ్మ జాతర శుక్రవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కు బడులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు విచ్చేసిన తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపన చౌదరి)ని ఆలయ మర్యాద లతో కమిటీ సభ్యులు సత్కరించారు. ఏప్రిల్ 6వ తేదీన ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

శ్రీవారి హుండీల ఆదాయం లెక్కింపు

ద్వారకాతిరుమల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశునికి హుండీల ఆదాయం లెక్కించారు. 11 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణా రూ.86లక్షలు వచ్చినట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో శుక్రవారం భద్రతాఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 103గ్రాముల బంగారం, 2.075 కేజీల వెండి లభించిన ట్లు వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (1), 1000(4) 2000(12)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

పెదపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఏప్రిల్ రెండు, మూడు తేదీల్లో దరఖాస్తులు పరిశీలన, అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లుగా ఎంపీడీవో అమీలు జమ తెలిపారు. 2వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు అప్పనవీడు, ఏపూరు, గోగుంట, గుడిపాడు, 1.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జయపురం, కలపర్రు, కొక్కిరపాడు, కొనికి, కొత్తముప్పర్రు, కొత్తూరు, పాతముప్పర్రు, పునుకొల్లు, రాజుపేట, వడ్డిగూడెం గ్రామాల లబ్ధిదారులకు, 3వ తేదీన ఉదయం పెదపాడు, సకలకొత్తపల్లి, సత్యవోలు, తోటగూడెం, వీరమ్మకుంట, మధ్యాహ్నం వట్లూరు గ్రామ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ప్రాంగణ ఇంటర్వ్యూలో ఎంపిక

పెదపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 80 మంది విద్యార్థులు ఎంపికైనట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. వీరిని గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్.ఆర్., పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారన్నారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల యజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం ఖాజీగూడెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దోమలవ్యాప్తి నిర్మూలనపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్ర పరిసరాలవల్ల దోమలు వ్యాప్తి చెందటంతోపాటు, వాటివల్ల ప్రాణాంతక వ్యాధులు సంభవించే ప్రమాదం ఉన్నదని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక తంగెళ్లమూడి అర్బన్ పీహెచ్‌సీ, ఎంఆర్‌సీ కాలనీ, కబడ్డీగూడెం, తదితర ప్రాంతాల్లో దోమలవ్యాప్తి, అంటువ్యాధుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పిల్లలకు చేతుల పరిశుభ్రత విధానంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ మల్లిఖార్జున్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ వేడుకలకు తరలిరావాలి

లింగపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండల కేంద్రంలో జరిగే తెలుగుదేశం 43వ ఆవిర్భావ వేడుకలకు కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో ఆయన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులను నాయకులను అడిగి తెలుసుకున్నారు.

సోపానం ఇంటర్వ్యూలు

నిడమర్రు మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు సజావుగా సాగాయి. బి.సి. కాపు కార్పొరేషన్‌లకు సంబంధించి ఇంటర్వ్యూలు జరిగాయి. మండలంలో మొత్తం 597 మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 421 మంది హాజరయ్యారు. ఈవోపీఆర్డీ స్వామి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పాస్టర్లు, నాయకులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

బుట్టాయగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాస్టర్స్ ఐక్యవేదిక, ప్రజాసంఘాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేశారు. జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్యవేదిక గౌరవ సలహాదారు మడివి జోసఫ్, సరియం రామ్మోహన్, మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్‌కుమార్ రాజమండ్రి సమీపంలో జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా మరణించడం బాధాకరమన్నారు. ఆయన మరణంపై విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించి వాస్తవాలను ప్రభుత్వం బయట పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాలు, కులాలు, ప్రజా స్వామికవాదులపైన దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల్లో రూ.3కోట్లు పక్కదారి



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

మృతి చెందిన వారి పేరు మీద మస్తర్లు

అర్ధరాత్రి 2గంటల వరకు సాగిన పెదవేగి మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెదవేగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో పెదవేగి మండలంలో రూ.3కోట్ల వరకు అవినీతి జరిగినట్లుగా సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. పెదవేగి మండలంలో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.23కోట్ల ఉపాధిపనులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి వారం రోజులుగా మండలంలోని 30గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి, ఎక్కడెక్కడ ఎన్ని పనులు జరిగాయి, ఎంతమేర నిధులు ఖర్చు చేశారు, పనులు సక్రమంగా చేశారా, నిధులు పక్కదారి పట్టాయా అని విచారణ చేశారు. అనంతరం గురువారం ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన విచారణ గురువారం అర్ధరాత్రి 2గంటలవరకు కొనసాగింది. ప్రతి గ్రామంలోనూ చేసిన పనులు, నిధుల వ్యయంపై కూలంకషంగా సమీక్షించారు. చాలా చోట్ల పనుల్లో అవినీతి జరిగినట్లుగా తేల్చారు. పాత ఇళ్లను కొత్తగా కట్టినట్లుగా చూపి ంచడం, మస్తర్లపై వేతనదారులు కాకుండా మేట్ ఒక్కరే సంతకాలు చేసి నిధులు కాజేయడం వం టి అంశాలను గుర్తించారు. అలాగే ఉద్యోగాలు చేసుకునే వారుకూడా పనికి వచ్చినట్లుగా చూపి ంచి, ఆ మేరకు సొమ్మును తినేసిన ఉదంతాలు ఈ ప్రజావేదికలో బయటకు వచ్చాయి. పనికి రానివారికి మస్తర్లు వేసి, ఆ సొమ్మును లాగేసుకోవడం చేశారని తేలింది. తాళ్లగోకవరంలో చనిపోయిన 14మందికి మస్తరు వేసి, సొమ్మును తమ ఖాతాలో వేసుకున్న సంఘటనపై విచారణాధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. బి.సింగవరంలో పాలకవర్గం తీర్మానం చేసినట్లుగా తీర్మానాన్ని తయారుచేసి, సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీచేసి, ప్రజావేదికలో చూపించి, నిధులను కాజేయాలని చూసిన ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకాన్ని అధికారులు గుర్తించి, చర్యలకు ప్రతిపాదించారు. వేగివాడలో ఏకంగా రూ.50లక్షల వరకు నిధులు దుర్వినియోగమైనట్లుగా తేల్చారు. మొత్తంగా మండలంలో రూ.23కోట్ల నిధులతో ఉపాధి పనులు జరుగగా.. రూ.3కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లుగా గుర్తించారు. పక్కదారి పట్టిన నిధులను బాధ్యులనుంచి తిరిగి రాబట్టడంతోపాటు బాధ్యులపై క్రమశిక్షణా చర్యలకు ప్రతిపాదించామని విచారణాధికారులు స్పష్టం చేశారు. ఈ సామాజిక తనిఖీ కార్యక్రమంలో విజిలెన్స్ ఏపీడీ పురుషోత్తమరావు, సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పీ సూర్య, ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఏపీవో హేమలత పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్ల ఏర్పాటు తప్పనిసరి

పెదవేగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఉపాధి యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి యూనిట్ల మంజూరుకు సంబంధించి పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లతో ఎంపీడీవో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి, యూనిట్ల మంజూరు విధానంపై చర్చించారు. మండల వ్యాప్తంగా 1097మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఖచ్చితంగా ఎంపిక చేసుకున్న యూనిట్‌ను స్థాపించాలని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పోస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):ఎండలు ముదురుతున్న దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే చంటి అన్నారు. పవర్‌పేటలో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, బొద్దాని శ్రీనివాస్, బొరోతు బాలాజీ పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు టూటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం జరుగుతుంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్నివీరాంజనేయులు అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, రోషన్‌కుమార్, ఎంపీ పుట్టా మహేశ్ హాజరవుతారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేడుకలో పాల్గొని జయప్రదం చేయాలని గన్ని కోరారు.

ఆస్తి పన్నుపై 50శాతం వడ్డీ మాఫీ

ఏలూరు టూటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్ను బకాయిలను ఈ నెల 31లోపు ఒకేసారి చెల్లిస్తారని అన్నారు. ఇప్పటికే పన్ను చెల్లించినవారికి వచ్చే ఏడాది వడ్డీరాయితీ సర్దుబాటు చేస్తామన్నారు. రంజాన్, ఉగాది పండుగ సెలవు రోజుల్లో కూడా క్యాష్‌కౌంటర్లు తెరిచే ఉంటాయని పన్ను చెల్లింపుదారులు క్యాష్ కౌంటర్‌లో పన్ను చెల్లించవచ్చని అన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



కామవరపుకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తడికలపూడి హైస్కూలు రోడ్డులోని లూర్దు మాత కొండ వద్ద జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ప్రజాప్రతినిధులు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ప్రథమ బహుమతి ఏలూరు సూపర్ కింగ్స్, రెండవ బహుమతి మేదినరావుపాలెం, మూడవ బహుమతి సోల్జర్స్‌కి ట్రోఫీతోపాటు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో పాస్టర్ దేమతోటి నతానియేలు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, వీఆర్వో రమేష్, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావు పాల్గొన్నారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఏలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ పాల్గొన్నారు. కార్మికులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాస్, నూకపేయి సుధీర్‌బాబు, నెరుసు చిరంజీవి, ఎం.జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు పాల్గొన్నారు.



కుంభమేళాలో టీడీపీ జెండాను పవిత్రం చేస్తున్న టీడీపీ నాయకుడు చంద్రశేఖరరెడ్డి(ఫైల్)

కుంభమేళాలో తడిపిన టీడీపీ జెండా

చింతలపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాళ్ళూరి చంద్రశేఖరరెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగాను, నాయకుడిగాను పనిచేస్తున్నారు. 140 సంవత్సరాలకు వచ్చే మహా కుంభమేళా జరిగే ప్రయాగ్‌రాజ్‌కు వెళ్ళి త్రివేణి సంగమంలో స్నానమాచరించి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ జెండాను త్రివేణి సంగమంలో స్నానమాచరింపచేసి ఆ తడిపిన జెండాను, అక్కడి త్రివేణి సంగమంలో నీటి జలాలను తీసుకువచ్చారు. వీటిని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం నాడు ప్రగడవరం గ్రామంలో జెండా ఆవిష్కరించనున్నారు. కుంభమేళా నుంచి తెచ్చిన జలాలను ఎన్టీఆర్ విగ్రహంపై అభిషేకరించే ఏర్పాట్లు చేశారు.

చింతలపూడిలో సీపీఐ ప్రచార యాత్ర

చింతలపూడి/టి.నరసాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణల చట్టం కోసం సీపీఐ విశేషంగా పోరాడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. సీపీఐ ప్రచార యాత్ర శుక్రవారం చింతలపూడి మండలానికి చేరుకుంది. శివపురం, మల్లేశ్వరం, గణిజర్ల, రాఘవాపురం, సమ్మెటవారిగూడెం, మల్లాయిగూడెం, పాత చింతలపూడి గ్రామాల్లో పర్యటించింది. చింతలపూడి పాతబస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ జరిపిన పోరాటాలను ప్రజాయాత్రలో తెలపాలని ఈ యాత్రలు చేపట్టినట్టు తెలిపారు. టీ.నర్సాపురం మండలంలోని బంధంచర్ల, కేతవరం, బల్లంచర్లరాజపాలెం, కొత్తగూడెం, గ్రామాల్లో కూడా ర్యాలీ నిర్వహించారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు ఎస్పీ అభినందన


ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పురస్కారాలకు ఎంపికైన సేవా పతక గ్రహీతలకు, ఉత్తమ సేవా గ్రహీతలకు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. ఈ అవార్డులు అందుకోనున్న 11 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందనలు తెలిపారు. సేవా పతకం గ్రహీతలు నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ సుభాష్, నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, ఏలూరు జిల్లా ఎఆర్ విభాగం ఆర్ఐ జీఎస్‌పీపీ పవన్‌కుమార్, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ టీకే కృష్ణారావు, చింతలపూడి కానిస్టేబుల్ సురేష్, టి నర్సాపురం కానిస్టేబుల్ ఎ.నాగబాబు, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎంవీఆర్ఎస్ నారాయణ, ఏలూరు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ చిట్టిబాబులు ఉన్నారు. ఉత్తమ సేవాపతక గ్రహీతలుగా ఎంపికైన ఏలూరు డీసీఆర్బీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ నాగు ఉన్నారు.


జర్నలిస్టుపై దాడికి ఖండన

పోలవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కైకలూరులో జర్నలిస్టుపై దాడి అమానుషమని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సొబ్బన రాజశేఖర్ బాబు అన్నారు. శుక్రవారం పోలవరం ప్రెస్‌క్లబ్ లో జరిగిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై కొందరు దాడికి పాల్పడి గాయపరచడాన్ని ప్రెస్‌క్లబ్ ఖండిస్తుందన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వేసవిలో నీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల సమావేశాలు





కొయ్యలగూడెం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు.. టి.నరసాపురం మండల సమావేశంలో జడ్పీటీసీ సామంతపూడి సూరిబాబు

కొయ్యలగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అధికారులు అసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కన్నాపురం పంచాయతీలో అనేక సమస్యలపై ఎంపీటీసీలు గణపతి, బాజీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ గ్రామంలోని చెరువుల్లో నీరు లేక రైతులు ఇబ్బందులుపడుతున్నారని గత ప్రభుత్వంలో ఈ చెరువులకు గేట్లు లేకపోవడంతో నీళ్లన్ని బయటకు వెళ్లిపోతున్నాయని అన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించటంలేదని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొయ్యలగూడెం, కన్నాపురం రహదారి, బయ్యన్నగూడెం, సరిపల్లె ర హదారి నిర్మాణాలు కూడా త్వరలో చేపడతామన్నారు. సమావేశంలో ఎంపీపీ గంజిమాల రామారావు, జడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు గంగరాజు, మట్టా వనజాలక్ష్మి, ఎంపీటీసీ గంటా శ్రీను పాల్గొన్నారు. ఎంపీపీ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు తొలగించాలని కూటమి నాయకులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని చేర వేశారు. దీంతో ఎమ్మెల్యే ఎంపీడీవోను ఫొటోలు తొలగించాలని కోరారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించాలి

టి.నరసాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు (సూరిబాబు) ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు, జాగ్రత్తలు వహించాలన్నారు. మండలంలో పాడైన చేతిపంపులను గుర్తించి మరమ్మతులు చేయించి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఉపాధి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. గండిగూడెం, బొర్రంపాలెం, టీ.నర్సాపురం పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతలు వెంటనే పూడ్చించాలని హెచ్చరించారు. ఎంపీడీవో మణికుమారి, తహసీల్దార్ సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.



వైస్ ఎంపీపీ గండికోట నాగరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పదవి అలంకారం కాదు బాధ్యత!

పెదవేగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : పదవి అనేది అలంకారం కాదని, ప్రజలు మనకిచ్చిన ఒక బాధ్యత అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ మండల వైస్ ఎంపీపీగా ఎన్నికైన గండికోట నాగరాజు శుక్రవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను పెదవేగి మండలం దుగ్గిరాలలో కలిశారు. ఈ సందర్భంగా నాగరాజును అభినందించిన ప్రభాకర్ పదవి మనకు అలంకారం కాకూడదన్నారు. పదవికే మనం అలంకారంగా ఉండాలని, అప్పుడే ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేసినట్లు అవుతుందని చెప్పారు.

కొల్లేరు గ్రామాల్లో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

ఏలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ఆపరేషన్ పేరుతో ప్రభుత్వం చేపట్టిన చర్యలు పేదలు, సొసైటీలు, డీ ఫారం పట్టాదారుల ఉపాధిని కొన్ని గ్రామాల్లో దెబ్బతీసిందని, జిరాయితీ రైతులు నష్టపోయారని, ముంపు కాలుష్యం పరిష్కారంకాలేదని, దీంతో కొల్లేరు పేదలు జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొల్లేరు ప్రజల సమస్యలపై చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర రెండవ రోజు రూరల్ మండలంలోని శ్రీపర్రు, మహేశ్వరపురం, కలకుర్రు గ్రామాల మీదుగా సాగింది. రవి మాట్లాడుతూ కొల్లేరు సరస్సును ఐదు నుంచి మూడవ కాంటూరుకు కుదించాలన్నారు.

కుల వృత్తిదారులను ఆదుకోవాలి



సీనియర్ కార్పెంటర్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్పెంటర్స్ డేను శుక్రవారం సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు కె.శివ మాట్లాడుతూ ప్రపంచ ఆధునికీకరణలో భాగంగా కుల వృత్తులు దెబ్బతిన్నాయన్నారు. వడ్రంగి పని పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. కె.సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో వర్క్‌షాపులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు గోపి మాట్లాడుతూ కుల వృత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వడ్రంగి వృత్తికి ప్రత్యేకంగా సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆధునిక మిషనరి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కార్పెంటర్ రేపాక మాధవరావును శాలువా కప్పి సత్కరించారు.

అపరాల సాగు రైతులకు రాయితీపై పైపులు

పోలవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో అపరాల సాగు చేస్తున్న రైతులకు 50 శాతం రాయితీపై నల్లపైపులు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. రైతులు అనంత బయోటెక్నాలజీ ఖాతా నెంబరుకి ఫోన్ పే ద్వారా చెల్లించి సంబంధిత పేమెంట్ రశీదు, పాస్‌బుక్ నకలు, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా నకలు, ఫొటోతో సమీప రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 29,30 తేదీలలో నగదు చెల్లించిన వారికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు.

31న ఉచిత వైద్య శిబిరం

పోలవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31 న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మానవత సంస్థ కన్వీనర్ ఆకుల నరసింహమూర్తి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరం రమా దంతవైద్యశాల, గౌతమీ నేత్రాలయ, రేవతి జనరల్ హాస్పటల్, తేజస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో విజిబుల్ పోలీసింగ్



ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు శుక్రవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రధాన కూడళ్లల్లో ఈ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజలకు, వాహనాలను ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి, వాహనాలకు ఇన్సూరెన్సు కట్టని యజమానులకు జరిమానాలు విధించారు.

వేసవి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) 42రోజుల వేసవి ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలలో మే 1నుంచి జూన్ 6వ తేదీ వరకు కటింగ్ అండ్ టైలరింగ్, నీడిల్‌వర్క్ అండ్ డ్రెస్‌మేకింగ్, డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, కర్నాటక్ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ ట్రేడుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఏప్రిల్ 3నుంచి 25వ తేదీ వరకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని వివరించారు. వయస్సు 18నుంచి 45సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ ఒకేషనల్/టెక్నికల్ ఉత్తీర్ణులైనవారు, టీటీసీ లోయర్ పూర్తిచేసి ఉండాలన్నారు. ఏదైనా విశ్వవిద్యాలయంనుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ కలిగిఉండాలన్నారు. పైన పేర్కొన్న అర్హతల్లో ఏదైనాఒకటి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవచ్చునని వివరించారు. అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తుచేసుకుని, అప్లికేషన్ ప్రింటవుట్, విద్యార్హతల ధ్రువీకరణపత్రాలను శిక్షణనిమిత్తం ఎంపికచేసుకున్న జిల్లాలోని డీఈవో కార్యాలయంలో అందజేసి మే 1నుంచి తరగతులకు హాజరుకావాలని సూచించారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి పోషకాలు

ద్వారకాతిరుమల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పలురకాల వైవిధ్యం గల పచ్చిరొట్ట విత్తనాలను చల్లడం ద్వారా భూమికి కావాల్సిన పోషకాలు అందడంతోపాటు పంటపొలాల్లో సేంద్రియకర్బనం పెరగడం వంటి ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంట ప్రకృతివ్యవసాయ వనరుల కేంద్రంలో పీఎండీఎస్ కిట్లను జిల్లాలో మొదటివిడతగా తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈకిట్ల ద్వారా పంపిణీ చేసే విత్తనాలు వేసవిలో భూమి వేడిని తట్టుకోవడమే కాకుండా పశువులకు మేతగా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ విత్తనాలను నాలుగుమండలాల సిబ్బందికి కిట్ల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి దుర్గారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పత్తేబాద రైతుబజారు సమీపంలోని నిశ్చింత వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి జనసేన నాయకులు నారా శేషు అతిథిగా పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

కలిదిండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కలిదిండి మేజర్ పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలిదిండి పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 80 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేశారన్నారు. మిగిలిన 20 శాతం ఈ నెల 31వ తేదీలోగా వసూళ్లు చేయాలన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది

కైకలూరు పంచాయతీలో..

టెండర్ వివాదం

- 86 మంది కాంట్రాక్ట్ సిబ్బందిని తప్పించేందుకు సర్పంచ్ ప్రయత్నం
- వైసీపీకి చెందిన వ్యక్తి పేరిట ఏజన్సీ ద్వారా టెండర్లు
- నేటి నుంచి పంచాయతీ కార్మికులు విధుల బహిష్కరణ

కైకలూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీలో టెండర్ ప్రక్రియలో సర్పంచ్‌కి, కాంట్రాక్టర్ లేబర్ సిబ్బందికి మధ్య మరోసారి వివాదం తెరకెక్కింది. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వాటర్ వర్క్స్ సిబ్బంది, ఎలక్ట్రికల్ వర్క్స్, చేపలచెరువుపై కాపాలాదారులు, చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్లు తమ సమస్యను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పనిలో నుంచి తీసివేస్తానని మూడు నెలలుగా సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఆమె భర్త ప్రసాద్ తమను భయభ్రాంతులకు గురిచేశారని వారు చెప్పిన విధంగానే కొత్త ఏజన్సీలను తీసుకొచ్చి టెండర్లు వేయించారన్నారు. ఏటా మార్చి 31వ తేదీకి కాంట్రాక్టర్ లేబర్ సిబ్బంది టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని కొత్త టెండర్లు వేసేందుకు శుక్రవారం పంచాయతీ అధికారులు ప్రకటన ఇచ్చారని దీంతో సర్పంచ్, ఆమె భర్త ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యాలయంలో కూర్చొని వైసీపీకి చెందిన వ్యక్తి పేరున ఏజన్సీ ఏర్పాటు చేశారన్నారు. వారికి ఎలాంటి అనుభవం లేదని కొత్త వ్యక్తులను తీసుకొచ్చి ప్రభుత్వం నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ ధరలు ఒక రోజు వేతనం రూ.480 ఉండగా తక్కువ ధరకు రూ.260కే టెండర్ వేయించారన్నారు. పంచాయతీలో మొత్తం 86 మంది సిబ్బంది ఉన్నారని వీరిలో 75 శాతం మంది సిబ్బంది 25 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న ఏజన్సీకి జిల్లా కలెక్టర్ అనుమతులున్నాయని, కొత్తగా వచ్చిన ఏజన్సీ నిర్వాహకులకు ఎలాంటి అనుమతులు లేవని అయినా ఆ ఏజన్సీలో నలుగురు వ్యక్తుల ద్వారా టెండర్లు తక్కువ ధరలకు వేయించారన్నారు. పంచాయతీని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని తమపట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారన్నారు. సర్పంచ్ వైఖరికి నిరసనగా శనివారం నుంచి పంచాయతీలో విధులను బహిష్కరిస్తామన్నారు. దీనిపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కి ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించగా ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్

ముదినేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల తీరును శుక్రవారం రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా కౌన్సిల్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి పరిశీలించారు. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూలు, సహాయ మాతా హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలో పదో తరగతి నాచురల్ సైన్సు పరీక్షకు 99 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 622 మందికి 618 మంది హాజరయ్యారని, ప్రైవేట్ విద్యార్థులు 96 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

10 మంది గైర్హాజరు

కలిదిండి : కలిదిండి, కోరుకొల్లు అరు తెగల పాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన నేచురల్ సైన్సు పరీక్షకు మొత్తం 836 మందికి 826 మంది హాజరుకాగా 10 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. సమస్యాత్మకమైన కోరుకొల్లు పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ రామకృష్ణ పరిశీలించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.



ముసునూరులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

భానుడి ప్రతాపం

- అల్లాడుతున్న ప్రజలు



ముదినేపల్లిలో గొడుగు నీడన..

ముసునూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత, వడగాడ్పులతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఎండ, ఉక్కపోతకు వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉందని, వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తుండటంతో వడదెబ్బ గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- ముదినేపల్లి, మార్చి 28 (ఆం ధ్రజ్యోతి): ఎండ తీవ్రత రోజు రోజుకీ పెరుగు తున్నది. వేడి గాలులతో ప్రజ లు బెంబేలెత్తి పోతున్నారు. ఉదయం 11 గంటలకే జనం బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఒంటిపూట బడుల కారణంగా మధ్యాహ్నం మండు టెండలో విద్యార్థులు ఇళ్లకు రావడం ఇబ్బంది కరంగా ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లల ను ఇళ్లకు తీసుకువస్తున్నారు.

24 గంటలు అందుబాటులో ఉంటా : మంత్రి

నూజివీడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి కొలుసు ప్రార్థసారధి అన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బారు నిర్వహించి ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజల శ్రేయస్సు, కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులందరికీ అందాలని, ప్రతీ ఒక్కరికి లబ్ధిచేకూరాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రజలు అనేక దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని గమనించానని, ల్యాండ్, రెవెన్యూ, సివిల్, ఫారెస్ట్, విద్యుత్, ఇతర సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. పూర్తి పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ సమస్యలపై 174 అర్జీలు స్వీకరించి సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

తానా మహాసభలకు ఆహ్వానం..

ఉత్తర అమెరికా తెలుగు సంఘ (తానా) మహా సభలకు రావాల్సిందిగా తానా ప్రతి నిధులు మంత్రి కొలుసు పార్థసారధిని ఆహ్వానించారు. శుక్రవారం ఆయనను కలిసి ఈమేరకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. జూలై 3 నుంచి 5 వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగే తానా మహాసభల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తానా ఛైర్మన్ గంగాధర్ నాదేళ్ల, తానా కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్, మాజీ అధ్యక్షుడు జయరాం కోమటి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు నగదు జమ

ఆగిరిపల్లి మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలంలోని అసంపూర్తిగా ఉన్న గృహాలకు ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయం లబ్ధిదారుల ఖాతాలలో జమ అయినట్లు ఏఈ సుందర్ కుమార్ తెలిపారు. మండలంలో 205మంది ఖాతాల్లో రూ.30.82 లక్షలు జమ కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

మీ అవినీతిని బయటకు తీస్తా..

- మాజీ ఎమ్మెల్యే దూలంపై ఎమ్మెల్యే కామినేని ఫైర్



ఎంపీటీసీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నేతలు

కైకలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారం పోయి 11 నెలలు గడుస్తున్నా ఇంకా అధికారంలో ఉన్నట్లు భ్రమపడుతూ వైసీపీ నేతలు అరాచకాలకు ప్రయత్నిస్తున్నారు. గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చేసిన అవినీతిని బయటకు తీసేందుకు పూర్తి స్థాయి విచారణ చేయిస్తా' అని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కైకలూరు వైఎస్ ఎంపీపీ ఉప ఎన్నిక అనంతరం శుక్రవారం విజయోత్సవాలను నిర్వహించారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన మంగినేని రామకృష్ణ, ఇతర ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. కామినేని మాట్లాడుతూ.. 'వైసీపీ అధికారం పోయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, అతని కుమారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. ఇంకా బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతున్నారు. భుజబలపట్నం ఎంపీటీసీ అతని ఇంటి వద్ద ఉండగానే కిడ్నాప్ చేసినట్టుగా ప్రచారం చేస్తూ కూటమి మీద బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి దృష్ట్యా గ్రామపెద్దల కోరిక మేరకు ఆ ఎంపీటీసీ వైసీపీకి మద్దతు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. అయినా అతనితో బలవంతంగా కూటమి మీద బురద చల్లేవిధంగా అసత్యపు ఆరోపణలు మాట్లాడించి లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి రాజకీయాలు కైకలూరులో చెల్లవు'.. అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు, కూటమి నాయకులు బీకెఎం నాని, కొడాలి వినోద్, పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, పూల రామచంద్ర రావు, పైడిపాటి శివశంకర్, బలే ఏసురాజు, లక్ష్మీరాణి, రమేష్‌బాబు, ఎండీ జానీ, వర ప్రసాద్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

చినకామనపూడిలో పైలట్ ప్రాజెక్టు రీసర్వే పూర్తి



చినకామనపూడిలో పైలట్ ప్రాజెక్టు రీ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ముదినేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు రీసర్వేలో భాగంగా ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామ ఏరియాలో నిర్వహించిన రీసర్వే పూర్తయింది. గ్రామ పరిధిలోని సుమారు 595 ఎకరాల విస్తీర్ణంలోని భూములను రెండు నెలలుగా రీ సర్వే చేసి ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు హద్దులను నిర్ణయించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన రోవర్ పరికరంతో ఈ సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించారు. జాయింట్ ఎల్‌పీల సమస్యలు లేకుండా వ్యక్తిగతంగా రైతుల భూములను సబ్ డివిజన్ చేయడమే ఈ పైలట్ ప్రాజెక్టు ఉద్దేశ్యమని, త్వరలో గ్రామ సభ నిర్వహించి రీసర్వే వివరాలను వెల్లడిస్తామని తహసీల్దార్ సుభాని తెలిపారు. రీసర్వే డీటీ ఉదయగిరి శ్రీనివాస ప్రసాద్, మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

ముదినేపల్లి/మండవల్లి/కలిదిండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కాపు కులాల సబ్సిడీ రుణాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం ముదినేపల్లిలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాలకు చెందిన 511 మంది దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉండగా, 490 మంది హాజరయ్యారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు శివ సూర్యనారాయణ, పి.రాము, ఎం.నాగరాజు, దినేష్ చౌదరి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండవల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం అర్జీదారులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 774 మంది దరఖాస్తు చేసుకోగా వారిని ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు ఇంటర్వ్యూ చేశారు. ఉదయం 10.30 గంటలకే సుమారు 600 మంది హాజరవడంతో ఆ ప్రాంగణమంతా కోలాహలం నెలకొంది. సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొండలరావు, బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మొత్తం 1300 మంది లబ్ధిదారులు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా, 650 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. మిగిలిన మరో 650 మంది లబ్ధిదారులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహి స్తామని తెలిపారు.

'యాదవులకు గుర్తింపు ఇచ్చింది టీడీపీనే'

కైకలూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే యాదవులకు అత్యంత గుర్తింపు లభించిందని ఏలూరు జిల్లా టీడీపీ విద్యావిభాగం అధ్యక్షుడు పెనుబోయిన మహేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కైకలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అంటేనే బీసీల పార్టీ అని అనేకమంది బీసీలతో పాటు యాదవ సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు పదవి వచ్చిందని ఏప్రిల్ 2న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రాష్ట్ర యాదవ కార్పొరేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

పంట కాల్వలో పూడికతీత

మండవల్లి మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మూడుతాళ్లపాడు పంటకాల్వ పూడికతీత పనులు చేపట్టారు. మండవల్లి జాతీయ రహదారి నుంచి మూడుతాళ్లపాడు రైల్వే గేటు వరకు రెండు కిలోమీటర్ల మేర పంటకాల్వ పూడుకుపోయిందని రైతులు తెలిపారు. కాల్వ కింద 1,400 ఎకరాల ఆయకట్టు ఉందని, సాగుకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎకరానికి కొంత సొమ్ము చొప్పున వేసుకొని పూడిక తీయించారు.



విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

ముసునూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ముసునూరు, చెక్కపల్లి పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించిన ఆయన పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. బయాలజికల్ సైన్స్ పరీక్షకు 12మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు.

ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూ

చాట్రాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో శుక్రవారం జరిగిన కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజర య్యారు. మండలంలో మొత్తం 93 యూనిట్లు మంజూరు కాగా 840 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలకు 702 మంది హాజరైనట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. పలు బ్యాంకుల అధికారులు, మం డల పరిషత్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

35 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఓగిరాల తండాలో నిర్వహించిన దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పరారైన మూడు కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి : మంత్రి పార్థసారథి



అపరభద్రాద్రి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

నూజివీడు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళల సమగ్రాభివృద్ధి దేశాభివృద్ధికి బాటలు వేస్తుందని, ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారని మంత్రి కొలుసు ప్రార్థసారథి అన్నారు. నూజివీడు విక్టోరియా టౌన్ హాల్లో టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి అర్హత ఉన్న ప్రతీ మహిళకు ఉచితంగా కుట్టు మిషన్లను అందిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు మహిళలు గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు అన్నే సురేష్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కొమ్మని విజయ, గోలు దుర్గాదేవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి పోస్టర్ ఆవిష్కరణ

చాట్రాయి: అపరభద్రాద్రి చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయంలో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి కొలుసు పార్థసారధి శుక్రవారం ఆవిష్కరించారు. చనుబండలో 6న జరిగే సీతారామ కల్యాణానికి మంత్రి పార్థసారధి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌ను ఆహ్వానించినట్లు ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి చెప్పారు. టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, కందుల కృష్ణ, మారేశ్వరరావు, దుర్గారావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన



మర్లపాలెంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

చాట్రాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రైవేట్ స్కూల్స్‌కి దీటుగా నాణ్యమైన విద్యా బోధన చేయటం అభినందనీయమని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి అన్నారు. మర్లపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ నాణ్యమైన విద్యా బోధన చేస్తే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందనడానికి నిదర్శనం మర్లపాలెం స్కూల్ అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిబాబు, ఉప సర్పంచ్ వెల్ది రాజారావు, వెల్ది అప్పారావు, సత్యనారాయణ, హెచ్ఎం అనూష తల్లిదండులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ విజయలక్ష్మి

చాట్రాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరు వడదెబ్బకు గురి కాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందని, దీనితో వడదెబ్బకు గురవుతారన్నారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర లేదా కలవరింత, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలు అని వివరించారు. నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, లేత వర్ణం తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తాగాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చెయ్యాలని, ఫ్యాను గాలి కానీ చల్లని గాలి కాని తగిలేలా చూడాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణం తాగించవచ్చునని అన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని, వీలైనంత త్వరగా దగ్గరలోని పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు.

సీసీ రోడ్ల ప్రారంభం వాయిదా

కలిదిండి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొళ్లపాలెం, కొండూరు, తాడినాడ, చినతాడినాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలిదిండిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నామన్నారు.



మండవల్లి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం

మండవల్లి మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో శుక్రవారం ఘనంగా మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. మల్లేశ్వరస్వామి 43వ వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా గూడూరు భవానీ శంకర్ పూర్ణాహుతి, త్రిశూలస్నానం చేయించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో శ్రీస్వామి, శ్రీఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాబూరావుకు అంబేడ్కర్ ఉగాది పురస్కారం



ముదినేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారానికి ముదినేపల్లికి చెందిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావు ఎంపికయ్యారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రశాఖ, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం సంయుక్తంగా ఈ పురస్కారానికి బాబూరావును ఎంపిక చేశాయి. ఉగాది సందర్భంగా ఈనెల 30న ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్ ఇతర కార్యవర్గ సభ్యులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మన్నెం రమేష్

నూజివీడు మార్చి 28 (ఆంధ్రజ్యోతి) నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మన్నెం రమేష్ ఎన్నికయ్యారు. నూజివీడు బార్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఎన్నికను నిర్వహిం చారు. అధ్యక్షుడిగా మన్నెం రమేష్, సెక్రటరీగా వై.హరిబాబు, ఉపాధ్యక్షుడిగా రాణి మేకల సత్యనారాయణ, ఎస్‌కేవీడీ. ప్రసాద్ ఎన్నిక య్యారు. ట్రెజరర్‌గా పల్లగాని వేణు లేడీ రిప్రజెంటేటివ్‌గా అక్కినేని రామకుమారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. వారిని మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, ఎల్.జానకిరామ్, సీనియర్ న్యాయవాదులు అభినందించారు.



జంగారెడ్డిగూడెం- విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సు

జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్సు

చాట్రాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడకు ఆర్టీసీ నూతన సర్వీసు ప్రారంభించింది. ఈ బస్సు ఉదయం 5.30 గంటలకు జంగారెడ్డిగూడెంలో బయలుదేరి చింతలపూడి, చాట్రాయి, విస్సన్నపేట, నూజివీడు మీదుగా 10.30 గంటలకు విజయవాడ చేరుతుంది. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు విజయవాడలో బయలుదేరి జంగారెడ్డిగూడెం చేరుతుంది. ఈ ప్రాంత ప్రజలకు ఈ బస్సు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగశైలజ

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

ముసునూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల బాలికలకు లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై శుక్రువారం అవగహన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి ఎ.నాగశైలజ మాట్లాడుతూ విద్యార్థినులు, పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరిగితే తక్షణమే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పోక్సో చట్టంతో పాటు రాజ్యాంగంలో బాలికల, మహిళల కోసం పొందుపర్చిన వివిధ చట్టాలు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.